క్లుప్తంగా

ఇళ్లపట్టాల పంపిణీ



ఇళ్లపట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లపట్టాలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఎం.బూర్జివలసలోని పేదలు ఇళ్లపట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం 90 రోజుల్లో ప్రభుత్వం వారికి ఇళ్లపట్టాలను మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతీ పేదవాడు బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభిమతమని, అందుకే ఆయన అనేకానేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఎంతో నిరుపేదలను ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ సీఎంగా గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం అక్కడి మెర్సీ వాల్ వద్ద పేదలకు నూతన వస్త్రాలను ఎమ్మెల్యే పంచిపెట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రాజేశ్వరరావు, ఉప తహసీల్దార్ బి.గౌరీశంకర్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి



వండానపేట పాఠశాలలో భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనాలు పెట్టాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట, చాటాయవలస, ఉప్పరనాయుడువలస తదితర పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలును మంగళవారం ఆయన పరిశీలించారు. భోజనాలు నాణ్యతతో, రుచికరంగా ఉండాలని, వండిన వంటలపై మూతలు పెట్టాలని, కాచి చల్లార్చిన నీటిని పిల్లలకు ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయించండి

బొబ్బిలి: జగనన్న కాలనీల్లోని గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సూచించారు. మంగళవారం స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు హౌసింగ్ అధికారులతో గృహ నిర్మాణాలపై సమీక్షించిన ఎమ్మెల్యే ఈ నెలాఖరులో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ ద్వారా సామూహిక గృహ ప్రవేశాలను ప్రారంభించే అవకాశం ఉందని, ఈలోగా నిర్మాణాలు పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. స్థానిక ఐటీఐ కాలనీ పక్కన 320 ఇళ్లల్లో ప్రారంభం కాని నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, ఏఈలు ఎన్.సత్యం, ఎ.సూర్యనారాయణ, సింహాచలం, ఆనందకుమార్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

రామభద్రపురం: మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. సాంకేతిక కారణాల రీత్యా మండలంలోని పలు మహిళా గ్రూపులకు ఆసరా పథకం మంజూరు కాకుండా నిలిచిపోయింది. ఎంపీపీ, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చొరవతీసుకుని, వారికి ఆసరా పథకం మంజూరుకు కృషి చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమామణితో కలిసి లబ్ధిదారులకు ఆసరా పథకం మంజూరు పత్రాలను ఎంపీపీ మంగళవారం అందజేశారు. మహిళలు చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం ఆసరా, చేయూత, చేదోడు పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రత్నాకర్, సీసీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో ఆదాయం

సంతకవిటి: పెరటికోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావచ్చని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అన్నారు. మండలంలో హంజరాం గ్రామంలో మంగళవారం వైకేపీ ద్వారా మహిళా సంఘాల సభ్యులకు పెరటికోళ్ల యూనిట్లు పంపిణీ చేశారు. 10 కోళ్లు ఉన్న యూనిట్‌ను రూ.4 వేలకు అందజేశారు. ఇందులో ఏడు పెట్టలు, మూడు పుంజులు ఉన్నట్లు ఏపీఎం టి.సీతారాం తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు వావిలపల్లి శ్రీనివాసరావు, రమాదేవి, తవితయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

రేగిడి: మండలంలోని నాయరాళ్లవలస, బూరాడ, తాటిపాడు, లచ్చన్నవలస తదితర గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ఏఓ జి.మురళీకృష్ణ, ఏఈఓ లీలామోహన్ మంగళవారం పరిశీలించారు. పంటకు కత్తెర పురుగు సోకడంతో నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. బెంజోయేట్ 100 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి, అందులో ఒక లీటరు వేపనూనె కలిపి ఆకు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేసినట్లయితే కత్తెర పురుగును నివారించవచ్చన్నారు.

జై.. గణేశ!



బొబ్బిలి: గొల్లపల్లి మెయిన్‌రోడ్డులో కొలువైన గణనాథుడు

వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏ వీధిలో చూసినా ధగధగలాడే విద్యుత్‌కాంతుల నడుమ గణనాథుని మండపాలు మెరిసిపోతున్నాయి. ప్రత్యేక ఆకృతులు, అలంకరణలో కొలువైన గణేశుని చూసి, తరించేందుకు భక్తజనం పోటీపడుతున్నారు. విశేషపూజలు చేస్తూ, కరుణాకటాక్షాలు తమపై కుమ్మరించమని వేడుకుంటున్నారు. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ.. జై గణేశ.. గణపతి బప్పా మోరియా.. నినాదాలతో మండపాల ప్రాంగణాలు మార్మోగుతున్నాయి.

–సాక్షి నెట్‌వర్క్.



బొబ్బిలి: పక్కి గ్రామంలో గణేశునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రామభద్రపురం చొక్కాపు వీధిలో వినాయక పూజలు



బాడంగి: మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద యువత



బొబ్బిలి: చీపురుపల్లి వీధిలో ఆకట్టుకుంటున్న ఆలయ సెట్ మండపం



రామభద్రపురం: మండపం వద్దకు గణనాథుని తరలిస్తున్న బాలలు



తెర్లాం: చీకటిపేటలో వినాయకునికి భక్తుల పూజలు



తెర్లాంలో గణనాథునికి పూజలు చేస్తున్న భక్తులు



బాడంగి: ముగడ కాలనీలో పూజలందుకుంటున్న బొజ్జ గణపయ్య



రాజాం సిటీ: కంచరాంలో పూజ చేస్తున్న యువకులు



రాజాం: బొద్దాంలో కొబ్బరికాయల గణనాథుడు



రాజాం: బొద్దాంలో దశకంఠ వినాయకుడు



రేగిడి: రేగిడిలో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు



రాజాం: మారుతీనగర్‌లో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు



వంగర: మద్దివలసలో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, గ్రామస్తులు



రాజాం సిటీ: లచ్చయ్యపేటలో వినాయకునికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంతోషం

- ఎమ్మెల్యే కంబాల జోగులు
- పాగిరిలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారంటే కచ్చితంగా నెరవేరుస్తారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని పాగిరి గ్రామంలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రతీ ఇంటికి సక్రమంగా అందుతుండడంతో ప్రతీ ఒక్కరూ ఆనందం వ్యక్తం చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ఆరాతీశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే పథకాలు అందేవని గుర్తుచేశారు. ప్రజా సంకల్పయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే వాటన్నింటినీ అమలు చేశారన్నారు. కోవిడ్ సమయంలో కూడా సంక్షేమ పథకాలు అందించి ప్రజలకు ఆర్థిక ఇబ్బందుల లేకుండా చేశారన్నారు. ప్రతీ రైతుకు రైతుభరోసా, మహిళలకు అమ్మఒడి, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలు అందుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, స్థానిక సర్పంచ్ పాగిరి కృష్ణవేణి, పార్టీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్శింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పాగిరి లెనిన్, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీరంగనాయుడు, చింతా రమణ, వండాన కుమారస్వామి, పాగిరి లక్ష్మున్నాయుడు, పాగిరి వెంకటరమణ, మక్క అప్పలనాయుడు, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



రాజాం: పాగిరిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

గడువులోగా ఓటర్ల జాబితా రూపొందించాలి

బాడంగి: గడువులోగా ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించి, అందివ్వాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ తహసీల్దార్లకు సూచించారు. మంగళవారం వర్చువల్ ద్వారా తహసీల్దార్లతో సమావేశమైన ఆయన ఓటరు సర్వే సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు జాగ్రత్తగా చేయాలని, మృతి చెందిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై అన్నిశాఖల అధికారులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచిచారు. స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. పశుసంవర్ధకశాఖపై చర్చ సందర్భంగా మండల పరిధిలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయని సంకిలి, లింగాలవలస ఎంపీటీసీలు మజ్జి శ్రీనివాసరావు, రెడ్డి నర్సింగరావు ఆరోపించారు. దీనిపై పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ స్పందిస్తూ మండలంలో 25 ఆర్‌బీకేలు ఉండగా.. పదిమంది వెటర్నరీ అసిస్టెంట్లు మాత్రమే ఉన్నారని, సిబ్బంది కొరత వల్ల వ్యాక్సినేషన్ ప్రక్రియ కొంచం ఆలస్యమవుతోందన్నారు. దీనిపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కలుగజేసుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతులకోసం, పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతో కృషిచేస్తోందన్నారు. అధికారులు సిబ్బంది కొరత ఉందని చెప్పడం సరికాదన్నారు. ఇన్‌చార్జ్ డ్యూటీలు వేసి రైతులకు సేవలందించాలని సూచించారు. సిబ్బంది కొరత విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై జరిగిన చర్చలో జేఈ శ్రీచరణ్ మాట్లాడుతూ.. మండలంలో 15 గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు మంజూరు కాగా, 11 గ్రామాల్లో పనులు పూర్తిచేశామని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో ప్రతీ సచివాలయ పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని పీఆర్‌జేఈ రామకృష్ణ వెల్లడించారు. వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు పంపిణీ జరిగిందని, అన్ని చోట్ల ఈ క్రాప్ నమోదుచేశామని వివరించారు. గ్రామ సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేసేలా చూడాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఎంపీడీఓ శ్యామలాదేవికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శ్యామలదేవీ, డీటీ శ్రీనివాసరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



పశువైద్యశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతిఇంటా సంక్షేమం వెల్లివిరిసి, ఆయా కుటుంబాల్లో సంతోషం నెలకొందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివడవలస గ్రామంలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోయినా, ఏవైనా సమస్యలున్నా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చడంతో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఆయన ప్రజలకు ఇచ్చిన మరెన్నో హామీలను నెరవేర్చారన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా పథకాలు రూపొందించి, నిరంతరాయంగా అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందివ్వడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. మరోవైపు ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులకు సచివాలయానికి రూ.20 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల కాళ్లచుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా లేదన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, ఈవోపీఆర్‌డీ ఎ.భాస్కరరావు, హౌసింగ్ ఏఈ ఎ.సూర్యనారాయణ, సర్పంచ్ లక్ష్మీరాణి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

సంక్షిప్తంగా..

విశ్వకర్మకు ఎమ్మెల్యే పూజలు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని తారకరామాకాలనీలో నిర్వహిస్తున్న విశ్వకర్మ జయంత్యుత్సవాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం పాల్గొని, విశ్వకర్మకు పూజలు చేశారు. అందరూ బాగుండేలా దీవించమని వేడుకున్నారు. ముక్కోటి దేవతలకు ముందే విశ్వకర్మ మహాముని అవతరించారని, ఆయనకు మనం పూజలు చేయడాన్ని అదృష్టంగా భావించాలన్నారు.

రుచి, శుచితో కూడిన భోజనం

బొబ్బిలి: మండలంలోని కారాడ ఎంపీపీ స్కూల్‌ను ఎంపీడీవో పి.రవికుమార్ మంగళవారం సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. రుచి, శుచి కలిగిన భోజనం పిల్లలకు పెట్టాలని, కొంచెం వేడివేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలు వడ్డించాలని సూచించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

కరాటే పోటీల్లో రాజాం విద్యార్థిని సత్తా

రాజాం: ఈనెల 17న పరవాడలో నిర్వహించిన ఫస్ట్ స్టేట్ లెవెల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2023 పోటీల్లో రాజాం కరాటే అకాడమీకి చెందిన సీహెచ్ తాన్విక సత్తా చాటింది. ఈ పోటీల్లో కాటా, కుమిటి విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. తాన్వికతో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన ఆర్.శివను పలువురు అభినందించారు.

ప్రారంభానికి సిద్ధం

రాజాం: పట్టణంలోని ఆదర్శనగర్‌లో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.80 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించినట్లు ఏఈ పి.వెంకట్ వెల్లడించారు. త్వరలోనే దీన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

తెర్లాం: మండలంలోని కూనాయవలస, జన్నివలస గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చాలా చురుగ్గా కొనసాగుతోంది. మంగళవారం వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, ఇంట్లో వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఎవరైనా అనారోగ్యంతో బాధపడితే వారి వివరాలను సేకరించారు. అలాగే కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం వివరించారు.

పుట్టినరోజున అన్నదానం

బొబ్బిలి: ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు పుట్టినరోజు పురస్కరించుకుని, ఆయన అభిమానులు పట్టణంలోని హ్యాండ్ ఇన్ హ్యాండ్ అనాథ ఆశ్రమంలోని విద్యార్థులకు అన్నదానం చేశారు. తన బర్త్ డే నాడు అభిమానులు అన్నదానం వంటి సేవా కార్యక్రమం చేయడం చాలా ఆనందంగా ఉందని వేణుగోపాలనాయుడు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సిరిపురం విద్యార్థులు

సంతకవిటి: ఈ నెల 21 నుంచి 23 వరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల నుంచి ఆర్.స్వాతి, బి.సోనియ, పి.శ్రీలత, ఎం.బాలాంజలి, ఎస్.సమీరా, బి.వెంకటలక్ష్మి, వి.రాజశేఖర్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వి.వెంకటరమణ తెలిపారు. విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ పీడీ సన్నిబాబును మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీహరిపురంలో పశువైద్య శిబిరం

వంగర: మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో పశువులకు వ్యాధులు సోకుతున్నాయని కొంత మంది రైతులు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడంతో పశు సంచార వైద్య వాహనం గ్రామానికి చేరుకొని అవసమైన వైద్య సేవలు అందించారు. వైద్యులు సత్యకృష్ణ, సిబ్బంది రమణ, మజ్జి ఉమా శంకర్ పశువులకు తనిఖీలు చేసి మందులు సరఫరా చేశారు.

పారిశుద్ధ్యంపై మున్సిపల్ చైర్మన్ ఆరా

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని 13వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు మంగళవారం పర్యటించి, అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులపై ఆరాతీశారు. ఎక్కడైనా డ్రైనేజీ, తాగునీటి సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని, అప్పుడే అందరం ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. అనంతరం మహరాణిపేట, ఎరుకుల వాడలో పర్యటించిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ జి.రమాదేవి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు కోరుతూ రిలేదీక్షలు

రాజాం: స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఎస్సీ వర్గీకరణ బిల్లు కోరుతూ ఎంఆర్‌పీఎస్ నాయకులు రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి, ఎస్సీలను ఏబీసీడీలగా విభజించాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ దీక్షలు ప్రారంభించినట్లు చెప్పారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

సంతకవిటి: మండలంలోని హొంజరాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను సంతకవిటి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగేంద్ర ప్రసాద్ పరిశీలించారు. సర్వేను పక్కాగా నిర్వహించాలని, ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్యంపై వాకబు చేయాలని సూచించారు.

నంది నాటక పోటీలకు 'శ్రీకాళహస్తీశ్వర'

రాజాం సిటీ: ఈ నెల 17న రాజాంలో ప్రదర్శించిన రాజాం కళాసాగర్ నాటక సంక్షేమ సంఘం ప్రదర్శించిన శ్రీకాళహస్తీశ్వర నాటకం నంది అవార్డు నాటక పోటీలకు ఎంపికైనట్లు కళాసాగర్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.దామోదరరావు, రంపా జగదీశ్వరరావుశర్మ మంగళవారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 18 వరకు నిర్వహించిన నాటక పోటీల్లో అన్ని జిల్లాల నుంచి 26 టీంలు ప్రదర్శనలు ఇవ్వగా.. అందులో పది నాటకాలు నంది అవార్డు పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.